క్లుప్తంగా

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

సీతానగరం: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను మండల విద్యాశాఖ అధికారులు జి.సూరిదేముడు, ఎం.వి.రమణ సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, బి.ప్రసాదరావు జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.గోవిందరావు కార్యవర్గ సభ్యులు బి.ఆదినారాయణ, ఎ.పోలినాయుడు, కె.మురళి, ఎస్.త్రినాథ్, కోశాధికారి డీవీ రమణ, తవిటినాయుడు, గిరి పాల్గొన్నారు.

ప్రతి గడపకూ అయోధ్య అక్షింతలు



తెలగవీధిలో ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు

రాజాం సిటీ: ప్రతీ గడపకు అయోధ్య శ్రీరాముని పూజిత అక్షింతలు పంపిణీ చేయనున్నట్లు రాజాం ఖండ్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని తెలగవీధిలో సోమవారం 'అయోధ్య అక్షిత్ అభియాన్' ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రామమందిర ఫొటోతో పాటు పవిత్ర అక్షింతలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

రూ.6.90 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం



ఆదర్శనగర్‌లో కొత్తగా వేసిన సీసీ రోడ్డు

రాజాం: పట్టణంలోని 17వ వార్డు ఆదర్శనగర్‌లో రూ.6.90 లక్షలతో సీసీరోడ్డు నిర్మించారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' నిధులతో సుమారు 300 మీటర్ల పొడవున ఈ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు మున్సిపల్ ఏఈ భాగ్యలక్ష్మి తెలిపారు. స్థానిక సమస్యలను 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో స్థానికులు ఎమ్మెల్యే కంబాల జోగులు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యేలా చొరవ తీసుకున్నారన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు దుస్తుల పంపిణీ

రాజాం సిటీ: స్థానిక భవిత కేంద్రంలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు రెడ్‌క్రాస్ రాజాం అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ కుటుంబసభ్యులతో కలిసి సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. ప్రతీ ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కొత్త అనంతరావు, కొత్తా జ్యోతి, కొత్తా సౌందర్య, భవిత కేంద్రం రిసోర్స్ పర్సన్లు హరిబాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ధాన్యం విక్రయాలు




ధాన్యాన్ని ట్రాక్టర్లతో తరలిస్తున్న రైతులు

వంగర: మండలంలోని అన్ని గ్రామాల్లో ఖరీఫ్ ధాన్యం విక్రయాలు జోరందుకున్నాయి. రైతులు వరిపంటను నూర్పిడి చేసి ధాన్యంను కొనుగోలు కేంద్రాలకు తరలించి విక్రయిస్తున్నారు. వంగర, కొప్పర, కొప్పరవలస, తలగాం తదితర గ్రామాల్లో రైతులు ధాన్యాన్ని పెద్ద ఎత్తున విక్రయాలు చేపడుతున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

రేగిడి: మండలంలో నాయిరాలవలస, లచ్చారాయపురం, జాడాపేట తదితర గ్రామాల్లో సోమవారం త్రైతసిద్ధాంత భగవద్గీతను ప్రచారం చేశారు. బొద్దాంకు చెందిన త్రైతసిద్ధాంత ప్రభోద సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఈ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ధనుంజయ, రమేష్, వెంకటరమణ, గోపాలకృష్ణ, చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల తులాభారం



తులాభారం వేస్తున్న భక్తులు

బొబ్బిలి: పట్టణంలోని సింగారపు వీధిలో ఉన్న వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు తులాభారం వేసి తమ భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. ధర్మకర్త గెంబలి శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులున్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



వీరఘట్టం: ఎమ్మెల్యే కళావతికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న అడారు గ్రామస్తులు

సీతంపేట: ఐటీడీఏలో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ కల్పనాకుమారి కేక్ కట్ చేశారు. అధికారులు, సిబ్బంది పీఓకు శుభాకాంక్షలు తెలియజేశారు. దీంతో కార్యాలయంలో సందడి వాతావరణం నెలకొంది.

ఎమ్మెల్యే కళావతి ఇంట నూతన సంవత్సర సందడి

వీరఘట్టం: పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి స్వగ్రామం వండువలో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు 2024 కొత్త సంవత్సరం వేడుకల సందడి నెలకొంది. పాలకొండ, వీరఘట్టం, సీతంపేట, భామిని మండలాల నుంచి అధికారులు తరలి వచ్చి ఎమ్మెల్యే కళావతికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వండువ గ్రామానికి చేరుకోవడంతో ఊరంతా సందడి నెలకొంది. వచ్చిన వారందరికీ ఎమ్మెల్యే తేనేటి విందు ఏర్పాటు చేశారు. అనంతరం నాలుగు మండలాల పార్టీ నాయకులు వైఎస్సార్‌సీపీ కేంద్రపాలక మండలి సభ్యుడు పాలవలస రాజశేఖరం, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జెడ్పీటీసీ సభ్యులు పాలవలస ఇందుమతి, పాలవలస గౌరీపార్వతీలను కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు.

సందడిగా..

భామిని: మండలంలో నూతన సంవత్సర వేడుకలు సందడిగా నిర్వహించారు. కాట్రగడ–బిలో ఎంపీపీ తోట శాంతికుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం దంపతులకు మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు కలిశారు. గ్రామాల్లో ఆదివారం రాత్రి నుంచి యువకులు ప్రత్యేక వేదికలు ఏర్పాటు చేసుకొని డీజేలు, డాన్స్‌లతో సందడి చేశారు. మహిళలు, బాలికలు ఇంటి ముంగిళ్లలో రంగు రంగుల ముగ్గులు వేసి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు.

శుభాకాంక్షల వెల్లువ

పాలకొండ: నూతన సంవత్సర వేడుకలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. శాసనమండలి సభ్యుడు పాలవలస విక్రాంత్‌కు శుభాకాంక్షలు తెలిపేందుకు రాజాం, పాలకొండ నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ అభిమానులు తరలివచ్చారు. ఎన్జీఓ సంఘం నాయకులు లిల్లీపుష్పనాథం, రంగాచారి, ఈశ్వరరావు, డీఎస్పీ కృష్ణారావు, సీఐ చంద్రమౌళితో పాటు పలు శాఖల అధికారులు విక్రాంత్‌ను కలసి కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు.



కురుపాం: ఎంపీపీ పద్మావతికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు



సీతంపేట: కేక్ కట్ చేస్తున్న పీఓ కల్పనాకుమారి



పాలకొండ: విక్రాంత్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న డీఎస్పీ, సీఐ, తదితరులు



వీరఘట్టం: ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది



భామిని: ఎంపీపీ శాంతికుమారికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎంపీడీఓ ఉమామహేశ్వరి



ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ట్రైబల్ రైట్స్ ఫోరం నాయకులు



గుమ్మలక్ష్మీపురం: ఎంపీడీఓ కార్యాలయం వద్ద వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు



గరుగుబిల్లి: ఎంపీపీ రామారావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



గరుగుబిల్లి: జెడ్పీ వైస్‌చైర్మన్ బాపూజీనాయుడుకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు



గుమ్మలక్ష్మీపురం: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా తాడికొండలో సహపంక్తి భోజనాలు చేస్తున్న గ్రామస్తులు

ఏజెన్సీలో పెరిగిన చలితీవ్రత

- దట్టంగా కురుస్తున్న పొగమంచు
- వాతావరణ మార్పుతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం
- ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



గుమ్మలక్ష్మీపురం గ్రామంలో దట్టంగా కురుస్తున్న పొగమంచు

గుమ్మలక్ష్మీపురం: గత కొన్ని రోజులుగా ఏజెన్సీలో చలి తీవ్రత పెరిగింది. రాత్రి, తెల్లవారు జామున మంచు విపరీతంగా కురుస్తోంది. ఈ పరిస్థితుల్లో సరైన జాగ్రత్తలు పాటించకుంటే సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు సరైన రక్షణ లేకుండా మంచులో తిరగడం చేయకుడదని హెచ్చరిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- చలిలో తిరగకూడదు, చల్లని పదార్థాలు తీసుకోకూడదు. అత్యవసరంగా బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు మాస్కులు ధరించాలి.
- ఉదయం పూట వాకింగ్‌కు వెళ్లే వారు మంకీ టోపీలు, బూట్లు, పూర్తిస్థాయిలో బనియన్లు, చేతులకు గ్లౌజ్‌లు వేసుకోవాలి.
- ఆస్తమా రోగులు ఆయాసం రాకముందే ముందులు వేసుకోవాలి.
- ఏడాదిలోపు పిల్లలను వెచ్చగా ఉండే ప్రదేశాల్లో ఉండేలా చూసుకోవాలి.
- ప్రయాణాల్లో చిన్న పిల్లల శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచాలి.
- విటమిన్–సి లభించే ఉసిరి, జామ, నిమ్మ, ద్రాక్షతో పాటు క్యాబేజీ, క్యాప్సికం, టమాటా వంటివి ఆహారంలో తీసుకోవాలి. తద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.

చలితో జాగ్రత్తగా ఉండాలి

చలికాలంలో ఆరోగ్య రక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వైరల్ జ్వరాలు, గొంతు ఇన్ఫెక్షన్లు, జలుబు, దగ్గు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఆస్తమా, శ్వాసకోస వ్యాధులతో బాధపడుతున్న వారు మరింత అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు ఉన్ని దుస్తులను వినియోగించడం మంచిది. అనారోగ్య సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించాలి. – ఎం.బుద్దేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి, తాడికొండ

ప్రగతిపథంలో నడవాలి...



మాట్లాడుతున్న హోలీక్రాస్ సంస్థ డైరెక్టర్ కరణం ప్రభుదాస్

భామిని: బాలికలు ఇంటి పనులకే పరిమితం కాకుండా బాగా చదువుకుని ప్రగతిపథంలో నడవాలని హోలీక్రాస్ సంస్థ డైరెక్టర్ కరణం ప్రభుదాస్ ఆకాంక్షించారు. మండలంలోని కారిగూడ తోటలో గ్లో క్లబ్ సభ్యులతో ప్రాంతీయ శిఖరాగ్ర సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాలికలలో నిబిడీకృతమైన శక్తులను బయటకు తీసేందుకు అవసరమైన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. బాగా చదువుకుంటే ఉన్నతమైన భవిష్యత్ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ఏపీసీ శ్రీవిద్య, మెంటర్స్ సంతోషి, సత్యవతి, మాధవి, కావ్య, రిమాళీ, భవానీ, సుకన్యచ, 13 గ్లో క్లబ్‌లకు చెందిన 130 మంది బాలికలు పాల్గొన్నారు.

ఘనంగా పాలవలస పుట్టినరోజు వేడుకలు



రాజశేఖరంనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

పాలకొండ: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, జెడ్పీ మాజీ చైర్మన్ పాలవలస రాజశేఖరం జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, తదితరులు రాజశేఖరంను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కుటుంబ సభ్యుల మధ్య రాజశేఖరం కేక్ కట్ చేయగా.. అందరూ శుభాకాంక్షలు తెలిపారు.

లోక రక్షకుడు ఏసు..



ఆరాధనకు హాజరైన క్రైస్తవ సోదరులు, విశ్వాసకులు

పాలకొండ రూరల్: ఏసు ప్రభువు లోక రక్షకుడని, ఆయన బోధనలు అనుసరణీయమని శ్రీకాకుళం మేత్రాసనం పీఠాధిపతి రాయరాల విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని చిన మంగళాపురంలో గల ఆర్‌సీఎం చర్చి వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీఠాధిపతి విజయ్‌కుమార్ దివ్యబలి పూజలో పాల్గొని, క్రీస్తు సందేశం వినిపించారు. ప్రభువు చూపిన సన్మార్గంలో నడిచి మెరుగైన సమాజ నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో రెవరెండ్ ఫాదర్లు భరత్‌రెడ్డి, దూసి దేవరాజు, తదితరులు పాల్గొన్నారు.



క్రీస్తు సందేశాన్ని వినిపిస్తున్న పీఠాధిపతి విజయ్‌కుమార్

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయానికి అయ్యప్పల గురుస్వామి చిట్టూరు శ్రీరామశర్మ రూ.1,00,311 విరాళం ఇచ్చా రు. స్థానిక ఉమానీలకంఠే శ్వరస్వామి దేవస్థానంలో ఆలయ నిర్మాణ ట్రస్టు బోర్డు సభ్యు లు అప్పికొండ ఆదిబాబు, గంట్యాడ విష్ణుమూర్తి, ఎస్.వి.జి.శ్రీనివాసరావు, దాసరి రవి శంకర్, దిలీప్‌కుమార్ ధనూకాలకు సోమవారం నగదు అందజేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ తన మిత్రుడు కల్లికాటిల్ ప్రభాకరణ్ నాయర్ జ్ఞాపకార్థం ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందజేసినట్లు చెప్పారు. కల్లికాటిల్ సుందర్, వెంకటేష్, గురుస్వాములు గొర్లె ఆనందరావు, కృష్ణ, లోలుగు రామచంద్రరావు, గవిడి నాగరాజు, రెడ్డి లక్ష్మణ, పొంద్రంకి గణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

గజపతినగరం: నూతన సంవత్సరంలో తొలిరోజును పురస్కరించుకుని మండల కేంద్రంలో ఆలయాలకు భక్తులు సోమవారం క్యూకట్టారు. స్థానిక ఉమారామలింగేశ్వర స్వామి, వేంకటేశ్వరస్వామి, సీతారా ముల ఆలయాల్లో అర్చకులు భక్తులతో ప్రత్యేక పూజలు,అభిషేకాలు చేయించారు.

రోగులకు వేడి నీటి సదుపాయం



వేడి నీటి పైపులను ప్రారంభిస్తున్న ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగభూషణరావు, తదితరులు

పాలకొండ రూరల్: రోగుల ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకుని వేడి నీరు అందించే ఏర్పాట్లు చేశామని స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జి.నాగభూషణరావు అన్నారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న సోలార్ విద్యుత్ సౌకర్యాన్ని సద్వినియోగపర్చుకుని ఏర్పాటు చేసిన హీట్ వాటర్ ప్లాంట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోగులు, వారి బంధువులకు వేడినీరు అందిస్తామని చెప్పారు. ప్రస్తుత సీజన్‌లో ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన లేదా గోరువెచ్చని నీటిని తాగడం శ్రేయస్కరకమని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ జె.రవీంద్రకుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ సోఫియా తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు



ఎంపీడీఓ శ్యామలాకుమారి

రేగిడి: మండలంలో కొత్తగా మంజూరైన వైఎస్సార్ పింఛన్లను ఈనెల 5 నుంచి పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ శ్యామలాకుమారి సోమవారం తెలిపారు. మండలంలో 11,021 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారని, వారందరికీ ఈ నెల నుంచి రూ.3 వేలు అందించనున్నట్లు చెప్పారు. దీంతో పాటు కొత్తగా 200 మందికి పింఛన్లు మంజూరయ్యాయని, వారందరికీ ఎమ్మెల్యే కంబాల జోగులు చేతులమీదుగా పింఛన్ డబ్బులు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్న ట్లు చెప్పారు.

166 కొత్త పింఛన్లు మంజూరు

సంతకవిటి: మండలంలో కొత్తగా 166 వైఎస్సార్ పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ రవికుమార్ సోమవారం తెలిపారు. ఈ నెల నుంచి రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలుకు పెంచిందని, ఈ నెల 3 నుంచి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కొత్త లబ్ధిదారులకు ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు చేతులమీదుగా పింఛన్లు పంపిణీ ఉంటుందన్నారు.

● పొగమంచు



బాడంగిలో దట్టంగా కురుస్తున్న పొగమంచు

బాడంగి: మండలంలో గత కొన్ని రోజులుగా పొగమంచు దట్టంగా కురుస్తోంది. మంచు ప్రభావంతో రోడ్లు సరిగా కనిపించక రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 8 గంటలైనా లైట్లు వేసుకొని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఎదురుగా వస్తున్న వాహనాలు దగ్గరకు వచ్చేంత వరకు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు భయపడుతున్నారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

రామభద్రపురం: మహిళలు స్వశక్తితో ఎదగాలన్న లక్ష్యంతో ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా, చేయూత, చేదోడు తదితర పథకాలు అమలు చేస్తోందని ఏపీఎంలు రత్నాకర్, సత్యనారాయణ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం వారు మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. మండలంలోని గత నాలుగున్నరేళ్లలో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా 13,792 మంది మహిళా సంఘ సభ్యులు రూ.18.19 కోట్లు పొందగా ఇప్పుడు మరో విడతగా ఈ నెలలో 10,509 మంది సభ్యులు రూ.5.2 కోట్లు పొందనున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ క్రాంతి పథకం ద్వారా మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. మహిళలు నిర్వహిస్తున్న వ్యాపారాలకు ఆర్థిక సహకారం అందిస్తోందన్నారు.

స్త్రీనిధి బ్యాంకు రుణాలతో పాటు వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నా వడ్డీ వంటి పథకాలతో పాటు స్త్రీనిధి బ్యాంకు రుణాల ద్వారా మహిళలు చిన్న వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. స్వయం ఉపాధి సాధించటంతో పాటు మరికొంత మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదుగుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీసీలు బాలకృష్ణ, ఈశ్వరరావు పాల్గొన్నారు.